

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 మే, 2022 సంచిక : 12

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565
Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
నువ్వెవరు? నేనెవరు? ........ 5
పరమాత్మలో లీనంకండి ........ 10
బాలవాణి-చిలుక చెప్పిన ........ 12
అక్రోధం ........ 14
శాశ్వత ధర్మగోప్త ........ 16
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 19
సాయిభక్త దాసగణు ........ 22
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 25
మాతృసంస్థ కబుర్లు ........ 29

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



మానవుడు బుద్ధిజీవి-మిగిలిన అన్ని ప్రాణులకన్నా తనకు విశిష్టంగా లభించిన వరం వంటి బుద్ధిని-మంచి చెడులు తెలుసుకోగల జ్ఞానాన్ని-మనిషి చక్కగా ఉపయోగించుకొని, ఎన్నెన్నో రంగాలలో చిత్రాతి చిత్రమైన విజయాలు సాధిస్తున్నాడు. ఎన్నో ఎత్తులకు ఎదుగుతున్నాడు. ప్రకృతి శక్తులను లొంగదీసుకున్నాడు. పక్షిలా ఎగరటం, చేపల్లాగా నీటిపైనా, నీటిలోనా కూడా సంచరించగలగటం చేయగలుగుతున్నాడు. ఎన్నో యంత్రాలు కనుక్కొని తన చిటికెనవేలు కూడా కదిలించకుండానే అన్ని పనులూ చేసుకోగలుగుతున్నాడు. ఇతర గ్రహాల మీదికి ప్రయాణించి వస్తున్నాడు. అలా .... అలా ... 'అసలు మనిషి చెయ్యలేని పని అంటూ ఉందా!' అని మనము ఆశ్చర్యపోయే స్థాయికి మనిషి ఎదిగాడు. ఇదంతా ఆనందప్రదమైన విషయమే. అయితే ఆ స్థాయికి వెళ్ళాక-అప్పుడు అసలు ఆలోచన ప్రారంభమవుతోంది. సామాన్యుడు ఏదో ఏదో సాధించాలనుకొని తపన పడుతూంటే-అసామాన్యులని అనిపించుకొన్నవారు, ఎంతో ఎత్తుకు ఎదిగారనుకున్నవారు-వెనుదిరిగి తాము సాధించింది చూచుకొని "అయ్యో! యింతేనా!" అనుకొంటున్నారు. ఇంతా చేసి మనిషి సాధించిందేమిటి? జంతువులు, పక్షులు చేసే పనులన్నీ చేయగలగటమా? కాని తన మనసును తాను అదుపులో ఉంచుకోగలుగుతున్నాడా? లేదే! అప్పటికిగానీ వారికి అర్థం కావటం లేదు-పరమాత్ముని సృష్టి చాలా అగాధమైనదీ, దాని రహస్యాలు అనంతమైనవీ-ఒక మనిషి తన జీవితకాలంలో అందులో అవగాహన చేసుకోగలది ఒక అణువంత కూడా ఉండదు అని. ఇప్పుడే కాదు-ఎప్పటినుంచో యీ కథ యిలా నడుస్తూనే ఉంది.

సుశ్రుతుడు భారతదేశానికే వన్నె తెచ్చిన గొప్ప వైద్యుడు. శస్త్రచికిత్స

(సర్జరీ)లో ఆద్యుడు. తలవెంట్రుకను నిలువుగా పన్నెండు చీలికలు చేయగలంత పదునైన ఆయుధాలను వేల సంవత్సరాల క్రితమే తయారుచేయగలిగిన మహానుభావుడు ఆయన. దాదాపు ఏడు దశాబ్దాలపాటు ఎన్నో వేలమందికి పోయే ప్రాణాలు నిలిపాడు. అయితే చివరికి ఆయనకొక సందేహం వచ్చింది. “నేను ఎంత కష్టపడి వ్యాధితో చచ్చే వారిని బ్రతికించినా, వాళ్లు శాశ్వతంగా బ్రతకటం లేదే! నూరేళ్లు నిండగానే మరణిస్తూనే ఉన్నారే! మరణించాక ఏమవుతున్నారు? ఎటు వెడుతున్నారు? ఏం జరుగుతోంది? అందులోనే భగవద్రహస్యం ఏదో ఉన్నది. అది తెలుసుకోవాలి” అనిపించింది సుశ్రుతునికి. దానితో ఆయన వైద్యవృత్తిని విడిచి తపోవనానికి వెళ్లిపోయాడు. “ఈ వైద్యం, ఎన్నో పరిశోధనలు-ఈ మానవ జీవనాన్ని సుఖమయం చేసుకోవడానికి మాత్రమే గాని ధన్యం చేసుకోవడానికి కాదు. ఇవి పరాకాష్ఠ కావు. కేవలం చిన్నచిన్న మెట్లు మాత్రమే” అని గ్రహించిన సుశ్రుతుడు తపస్విగా మారిపోయాడు.

ఐజాక్ న్యూటన్-భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన గొప్ప శాస్త్రవేత్త ఆయన “ప్రపంచంలో ప్రతి ఒక్క చర్యకు కూడా అంతే బలమైన ప్రతి చర్య ఉండి తీరుతుంది” Action and Re-action are equal and opposite - అని అన్నాడు. అనాదిగా భారతీయులు ఆధ్యాత్మిక రంగంలోనూ, పాపపుణ్యాల విషయంలోనూ విశ్వసించి మనం చేసిన కర్మఫలంగానే కష్టసుఖాలు కలుగుతుంటాయని చెప్పకొంటూ ఉంటారు. ఈ సిద్ధాంతాన్ని న్యూటన్ భౌతిక విషయాలలో కూడా ప్రతిపాదించి ఋజువు చేసాడు. ఇలా ఎన్నో విధాల విజ్ఞానాన్ని ప్రవర్తిల్లజేసి, ఎంతో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొన్న న్యూటన్ తన జీవితపు చరమదశలో యిలా అన్నాడు. “ఇంతకాలం, ఇన్నేళ్లుగా సముద్రతీరాన నిలచి, అక్కడున్న నత్తగుల్లలూ, శంఖాలూ ఏరుకొంటూ గడిపాను. అసలు రత్నాలు, ముత్యాలూ ఏరుకోవడానికి సముద్రంలోకి దిగనే లేదింకా” అని. పరమాత్ముని చిచ్ఛక్తి ఒక అనంత సాగరం అని ఆయన అంగీకరించాడు. ఐన్‌స్టైన్ థియరీ ఆఫ్





రెలిటివిటీ, సాపేక్ష సిద్ధాంతం, ప్రపంచ విఖ్యాతులు ఆయన సాపేక్ష సిద్ధాంతంపై ఆధారపడి ఎన్నో క్రొత్తక్రొత్త ఆవిష్కరణలు వచ్చాయి. కాంతి కిరణాలు తిన్నగాగాక వక్రంగా కూడా ప్రయాణిస్తాయని ప్రతిపాదించి దాని మీద ఒక ఉద్గ్రంథమే వ్రాసాడు.

ఆయన ఒకసారి “నేను ఒక్కొక్క విషయాన్ని కనుక్కొనే కొద్దీ, భగవత్సృష్టి ఎంత రహస్యమయమైనదో, ఎంత అద్భుతమైనదో అర్థమవుతున్నది. దీన్ని భేదించటం నా వలన అవుతుందని నేననుకోను” అన్నాడు. శరీరంలో రక్తం నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుందని కనుగొన్న విలియం హార్వే “ఇంత చక్కని నరాలను నిర్మించి, పకడ్బందీయైన పద్ధతిని ఏర్పాటు చేసిన భగవంతుని శక్తి ముందు నేను తలవంచుతున్నాను” అన్నాడు.

ఏ గొప్ప స్థలం చూచినా, ప్రకృతి దృశ్యం చూచినా, సౌందర్యం చిప్పిల్లే మనిషిని చూచినా, పరిమళాలెగబోసే పూలను చూచినా, అద్భుతమైన వర్ణ సమ్మేళనంతో నిండిన నెమలిని చూచినా, గంభీరమైన సాగరాన్నీ, ఎత్తైన కొండ శిఖరాన్ని - దేన్ని చూచినా ఇవే యింత పరమ సుందరంగా ఉన్నాయే-ఇక వీటిని సృష్టించిన ఆ పరమ పురుషుడు ఇంకెంత మనోహరుడో!ఎంతటి మహనీయుడో అనిపిస్తుంది అన్నాడు రవీంద్రనాథ్ ఠాకూర్.

మొత్తం మీద మానవుడు సాధించగల వాటి పరాకాష్ఠ పరమాత్ముని పాదాలు దగ్గరిదాకా వచ్చి ఆగిపోతోందే తప్ప అంతకుమించి పైకి పోలేకపోతున్నది. అలా తీసుకువెళ్లగలది ఆధ్యాత్మికత ఒక్కటే. అది తెలిసే మన వాళ్లు ఏ శాస్త్రం, గొప్ప విషయాలు కనుగొన్న వారికైనా పి.హెచ్‌డి. అంటే డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అన్న టైటిల్ యిస్తారు.

అంచేత మిత్రులారా, మనం కనుగొన్న కంప్యూటర్లు, రోబట్లు, రాకెట్లు, ఇంటర్‌నెట్లు ...అన్నింటినీ మించిన మహాశక్తి మరొకటి ఉంది. దాన్ని గ్రహించటమే మానవవిజ్ఞానానికి పరాకాష్ఠ అని గ్రహిద్దాం. నిరంతరం దాన్ని స్మృతిపథాన ఉంచుకొని నిరహంకారంతో లోకకళ్యాణం కోసం కృషిచేద్దాం.

# నువ్వెవరు? నేనెవరు?

మహాభారత యుద్ధంలో పదమూడో రోజు దాయాదుల దాష్టీకానికి దయనీయంగా అసువులు బాశాడు అభిమన్యుడు. కన్నకొడుకు కన్ను మూశాడని తెలిసి అర్జునుడు ఆక్రోశించాడు. ఆవేశంతో జయద్రథుణ్ణి తదితరులను హతమార్చాడు. అయినా అర్జునుడి ఆవేదన తీరలేదు. సర్వజ్ఞుడూ, సాక్షాత్తూ భగవానుడూ అయిన శ్రీ కృష్ణ పరమాత్మణ్ణి ఆశ్రయించాడు. ఆనాడు గురుదేవులైన సాందీపుడి కుమారుడిని రక్షించిన ఉదంతాన్ని గుర్తు చేసి, తనకూ పుత్రభిక్ష పెట్టాల్సిందిగా పార్థుడు ఆ పరాత్పరుడిని వేడుకున్నాడు. ఇంత భగవద్గీత బోధించినా, పుత్రవాత్సల్యంతో విలవిలలాడిపోతున్న విజయుడిని చూసి విస్మయం చెందాడు ఆ విశ్వంభరుడు. పుట్టిన వారు గిట్టక తప్పదని, 'జాతస్య హి ధ్రువో మృత్యుః...' అని మరోమారు జ్ఞాపకం చేశాడు.

ఎవరికి ఎవరూ శాశ్వతం కాదని ఎంత చెప్పినా, కడుపుశోకం కిరీటిని కర్తవ్యతా విమూఢుణ్ణి చేసింది. అప్పుడు ఆ పరంధాముడు ఆ పాండుపుత్రుడికి ప్రత్యక్షంగా పాఠాన్ని నేర్పాలనుకున్నాడు. 'సరే అర్జునా! స్వయంగా ఆ స్వర్గలోకానికి నిన్నే తీసుకువెళతాను. నీవే అభిమన్యుడిని ఈ భూలోకానికి వెంట తెచ్చుకో" అన్నాడు. ఆనందంతో అంగీకరించి, శ్రీకృష్ణుడితో కలసి స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ యువరాజుగా కిరీటధారియై అభిమన్యుడు ఠీవిగా కూర్చొని రాచకార్యాల్లో మునిగివున్నాడు.

అర్జునుడు అమితానందంతో కొడుకు దగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళాడు. 'నాయనా! భూలోకానికి వెళదాం రా!' అన్నాడు. అభిమన్యుడు ఆశ్చర్యపోతూ, 'ఎవరు నువ్వు? నేను నీతో భూలోకానికి రావడం ఏమిటి?' అన్నాడు.

'నేనెవరో తెలియదా? నేను నీ తండ్రిని!' అన్నాడు ఫల్గుణుడు. 'నీవెవరో నాకసలు జ్ఞాపకమే లేదు. ఎన్నో జన్మలు ఎత్తాను. నీవు ఏ జన్మలో తండ్రివో!





పోషించిన పాత్రలు చాలు! నేను నీతో రాలేను; వెళ్లిపో అన్నాడు.

అప్పుడు కనువిప్పు కలిగింది కిరీటికి! మౌనంగా మాధవుడితో కలసి భూలోకానికి పయనమయ్యాడు. మనం కూడా ఆ అర్జునుడి లాగే మమకారాల అయోమయంలో పడి అసలు మర్మాన్నే మరచిపోతున్నాం. అందుకే 'భజ గోవిందం' పరంపరలో ఆదిశంకరాచార్యుల అనుంగు శిష్యులు సురేంద్రుడు ప్రతి ఒక్కరినీ 'నువ్వెవరో? నేనెవరో?' ప్రశ్నించుకోమంటూ....

**కస్త్వం కోఽహం కుత ఆయాతః కా మే జననీ కోమే తాతః।**

**ఇతి పరిభావయ సర్వమసారం విశ్వం త్యక్త్వా స్వప్న విచారం॥**

అని ప్రవచిస్తున్నారు. నువ్వెవరు? నేనెవరిని? నేను ఎక్కడి నుంచి వచ్చాను? నా తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? నిస్సారమైన కలలాంటి ఈ ప్రపంచాన్ని పక్కనపెట్టి ఆలోచించమంటున్నారు. సర్వం అసారమనీ; స్వప్నసమానమనీ హితవు పలుకుతున్నారు. వాస్తవం ఏమిటో తెలుసుకొని నడుచుకోమంటున్నారు.

**విచారణకు వెరపెందుకు?:** జన్మమృత్యు పరంపరాగతమైన ఈ జీవన చక్రం ఎందుకిలా పరిభ్రమిస్తుందోనని ఎవరికి వారు ప్రశ్నించుకోవడం లేదు! అసలు మనం ఇన్ని బంధనాల్లో ఎందుకు చిక్కుకుంటున్నామో ఆత్మావలోకనం చేసుకోవడం లేదు. ఇలా విచారణ చేసుకోవడం మొదలు పెడితే ఈ మాత్రం ప్రశాంతంగా కూడా ఉండలేమేమో అనే భయంతో చాలామంది సంసార కాసారంలో గుడ్డికప్పల్లా ఈదులాడుతున్నారు. ఆలోచిస్తూ పోతే మనం సాధించామనుకుంటున్నవన్నీ చిల్లిగవ్వల్లా అనిపిస్తాయన్న భయంతోనే అసలు ఆలోచించడమే మానేశాం. కానీ ఎప్పుడో ఒకప్పుడు ఆ చిల్లిగవ్వలను జారవిడుచుకోక తప్పదు.

అలా ఏదో జరిగిపోయాక పశ్చాత్తాపపడి వైరాగ్యం పెంచుకోవడం కన్నా, పూర్వతాపంతో ముందే వివేకంతో మెలగడం మంచిదని 'భజ

గోవిందం' బోధిస్తోంది.

అందుకే మన సనాతన ధర్మం రెండు రకాల వైరాగ్యాల గురించి ప్రస్తావించింది. అవి-రాజసిక వైరాగ్యం, సాత్త్విక వైరాగ్యం! సంపదనో, పదవినో, హోదానో, బంధువులనో కోల్పోవడంలాంటి దుస్సంఘటనలు సంభవించినప్పడు కలిగేది రాజసిక వైరాగ్యం. బాహ్యకారణాలేవీ లేకుండానే కేవలం పరిశీలనాత్మకమైన బుద్ధిచేత, నిత్యానిత్య వివేకం వల్ల ప్రాప్తించేది సాత్త్విక వైరాగ్యం. రాజసిక వైరాగ్యం కన్నా, సాత్త్విక వైరాగ్యం మనలో శాశ్వతమైన మార్పును తీసుకువస్తుంది. అలా స్వయంగా తాము వ్యక్తిగత కష్టనష్టాలనేమీ అనుభవించకపోయినా, గౌతమబుద్ధుడు, ఏసు క్రీస్తు, గురునానక్, మహమ్మద్ ప్రవక్త లాంటి మహాత్ములు ఈ లోకుల అజ్ఞాన జనిత దుర్భర స్థితులను చూసి వైరాగ్యాన్ని పొందారు. అలాంటి వైరాగ్యాన్ని సమర్థిస్తూ ఇలా అన్నారు మన మహర్షులు :

**బీభత్సం విషయం దృష్ట్వా కోనామ నవిరజ్యతే?।**

**సతాముత్తమ వైరాగ్యం వివేకాదేవ జాయతే ॥**

జీవితంలో బీభత్సమైన విషయాలు చూసినప్పడు వైరాగ్యం ఎవరైనా పొందుతారు. అది సహజమే. అందులో మహత్తరమైన విషయం ఏముంది? అయితే ప్రాజ్ఞులకు వైరాగ్యం ఇతరుల కష్టసుఖాలను చూసినప్పడో, ఏకాంతంలో స్వవిచారణవల్లనో కలుగుతుంది. అలా ప్రాజ్ఞులమయ్యేందుకు ప్రయత్నించాలి.

**కల్పనలకు కలవరమా? :** భగవాన్ రమణులు 'నేనెవరు?' అని ప్రశ్నించుకుంటూ ముందుకు సాగిపోవడమే జీవితంలోని అన్ని సమస్యలకూ పరిష్కారమనేవారు. ఇలా ఎప్పటికప్పడు నిత్యజీవనంలోని అనుబంధాలను ఎలాంటి దాపరికం లేకుండా విశ్లేషించుకుంటూ పోతూ ఉంటే, ఒక్కటొక్కటిగా దారపుపోగుల్లా విడివడి అసలు స్వరూపం అర్థమవుతుంది. అప్పడు ఈ కష్టసుఖాలు, రాగద్వేషాలు, జయాపజయాలన్నీ కాలంలో





పుట్టి, కాలంలో కలసిపోయేవిగా, స్వప్నంలోని సంఘటనల్లా తోస్తాయి. ఏకాంతంలోకి వెళ్లి కాసేపు ఈ ప్రపంచాన్ని పక్కన పెట్టి, అసలు మనమేంటి? మనం వెళుతున్న మార్గమేంటి? అని ఆత్మపరిశీలన చేసుకుంటే జీవితంలో ఇంత అలజడి ఉండదు.

దీనికి పెద్ద సాధనలేమీ చేయనక్కరలేదు; సన్యాసులేం కానవసరం లేదు. కేవలం కళ్ల ముందు జరుగుతున్న వాటిని చూసి అంతర్మథనం చేసుకుంటే చాలు! అయితే దురదృష్టవశాత్తూ ఆధునిక ప్రపంచంలో విషయ సుఖాలు ఏకాంతం నుంచి మనల్ని దూరం చేస్తున్నాయి. నిరంతరం ఏదో ఒక వ్యసనంలోనో, వ్యాపకంలోనో పొద్దుపుచ్చేలా పురిగొల్పుతూ ఉన్నాయి. మన నిజవాసమేమిటో, మన నిజ గమ్యమేమిటో తెలియకుండా కళ్లకు గంతలు కట్టి పరుగులు తీయిస్తున్నాయి. అశాశ్వతమైన అనుబంధాలను అజరామరమనుకునేలా భ్రమలు కల్పిస్తున్నాయి. అల్పమైన వాటి కోసం అపురూపమైనవి జారవిడుచుకునేలా ప్రలోభపెడుతున్నాయి. అందుకే గౌతమ బుద్ధుడు ...

**సుఖమాత్రా పరిత్యాగా త్పశ్యే చ్ఛేద్విపులం సుఖమ్**

**సుఖమాత్రాం త్యజేద్ధీరః సంపశ్యన్ విపులం సుఖమ్ ..**

'అల్పమైన సుఖాన్ని పరిత్యజించడం చేత అధికమైన సుఖం కలుగుతుందని అనుకున్నప్పడు, బుద్ధిమంతుడవై అధికమైన సుఖం మీద దృష్టితో అల్పసుఖాన్ని విడిచిపెట్టమ'ని హితవు పలుకుతాడు.

**మితిమీరితే మనస్తాపం :** ఎవరితోనూ మితిమీరిన మానసికానుబంధాన్ని పెంచుకోకూడదు. వారి తోటిదే లోకమనుకోకూడదు. అలా దశరథుడు లేకలేక కలిగిన కొడుకు శ్రీరామచంద్రుడిపై విపరీతమైన మమకారాన్ని పెంచుకున్నాడు. కానీ, కాలం కైకరూపంలో ఆ మమకారంపై కాటేసింది. ఇలా పరిమితిని మించి ప్రేమ పరిధులు దాటుతున్న ప్రతి సందర్భంలోనూ 'నేనెవరు? వారెవరు?' అని ప్రశ్నించుకుంటూ ఉండాలి.

కాంక్షను పెంచుకున్న ప్రతి వ్యక్తినీ, వస్తువునూ కనికరం లేకుండా మన నుంచి లాగేసుకోవటమే కాలపురుషుడి పని! కడలి కెరటం హఠాత్తుగా వచ్చి, పసిపిల్లాడు తీరంలో ప్రీతిగా కట్టుకున్న ఇసుక గూటిని తనలో కలిపేసుకున్నట్లు, కాలం మనకిష్టమైన వాటన్నింటినీ నిర్దాక్షిణ్యంగా తనలో లయం చేసుకుంటూ ఉంటుంది. ఆ సత్యాన్ని గుర్తెరిగి అనుదినం ఆత్మీయతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 'భగవంతుడే నిత్యం, తక్కినవన్నీ అనిత్యం. జీవులు, జగత్తు, ఇల్లూ-వాకిలీ, పిల్లాజల్లా-ఇవన్నీ గారడీవాడి గారడీయే. అతడు కర్రతో డోలును వాయిస్తూ 'క్షూ క్షూ మంత్రకాళీ! రండి, గారడీ చూడండి' అంటూ ఉంటాడు. ప్రేక్షకులతో 'రండి, ఈ కుండ మూతతీయండి' అంటాడు. మూత తీయగానే కుండలో నుంచి అనేక పక్షులు ఆకాశంలోకి ఎగిరిపోతాయి. కానీ గారడీవాడే సత్యం; వాడు చేసే గారడీ అంతా అనిత్యం. అనిత్యమనేది ఇప్పటికిప్పుడు ఉంటుంది; ఇంతలోనే మాయమైపోతుంది' అనేవారు.

**ఇహపరాలన్నీ ఈశ్వరచ్ఛాయలే!** : దీర్ఘంగా ఆలోచిస్తూ పోతే ఈ లోకంలో స్థిరమైనవాడు, శాశ్వతమైనవాడు ఆ భగవంతుడు ఒక్కడే! ఒక్కమాటలో చెప్పాలంటే ఇహపరాలన్నీ ఆ ఈశ్వరుడి ఛాయలే! తను పరోక్షంగా ఉండి, ఈ సమస్త ప్రపంచాన్నీ పసిపాపను చేసి ఆడిస్తూ ఉన్నాడు. ఈ జగత్తులో ఉండే పదార్థాలన్నీ విచారించి చూడనంత వరకే మనోహరంగా కనిపిస్తాయి? విచారణ అంతా ముగిశాక మనోహరుడు ఆ మాధవుడేనని అర్థమవుతుంది. అందుకే 'ప్రపంచంలోని అందాలు, ప్రేమలు, సౌఖ్యాలు-అన్నీ ఈశ్వరచ్ఛాయలే. వాటి వల్లనే ఆకర్షిస్తాడు, తనని గుర్తింపజేస్తాడు ఈశ్వరుడు. కానీ, తీరా ఆయనను తెలుసుకోవాలంటే ఈ అందాలే, ఆకర్షణలే మానవుడి పురోగమనానికి అభ్యంతరాలవుతాయి. అదే మాయ' అంటారు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్. 'గీతాంజలి'పై వ్యాఖ్యానం వ్రాస్తూ





ఓ కవి! ఆ మాయను ఛేదించుకోవాలంటే మళ్ళీ ఆ పరమ ప్రభువు పాదాలనే ఆశ్రయించాలి. విచారణ కన్నా ముందు ఆయనపై విశ్వాసాన్ని పెంచుకోవాలి.

బందీలుగా చేసేది తనే! బంధనాలు తెంచేదీ తనే! కనుక సంపూర్ణ శరణాగతితో ఆ సర్వేశ్వరుణ్ణే ఆశ్రయిద్దాం! జనన మరణాల గుట్టువిప్పి మనల్ని గట్టెక్కించమని వేడుకుందాం!

# పరమాత్మలో లీనం కండి

- స్వామి యతీశ్వరానంద

ఆధ్యాత్మిక చైతన్యం ఉన్నతస్థాయిలకు చేరుకున్నప్పుడు, సాధకుడు దృశ్యమాన ప్రపంచాన్ని పూర్తిగా మరిచిపోతాడు. శ్రీరామకృష్ణులు ఒక వేటగాడి కథను చెప్పేవారు. ఆ కథలో, ఒక వేటగాడు ఒక పక్షికి బాణం ఎక్కుపెట్టి, పక్కనే వెళుతున్న మేళతాళాల పెళ్ళి ఊరేగింపుని ఏమాత్రం పట్టించుకోడు.

ఆధ్యాత్మిక ప్రపంచంలో ఒక నియమం ఉంది. ఏ వస్తువునైతే మనం యథార్థం, నిత్యం అనుకుంటామో, ఆ వస్తువు మన సర్వశక్తులనూ, మేధస్సునూ, ఆలోచనలనూ ఆకర్షిస్తుంది. ఈ ప్రపంచాన్నే శాశ్వతమైనదిగా అనుకుంటే, ఈ ప్రపంచంతోనే మనం నిండిపోతాము. ఒక శాస్త్రవేత్త విజ్ఞాన శాస్త్రపు ఆలోచనలతో నిండిపోయి ఉంటాడు. ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టాలనుకునే వారికి పరమాత్మ వాస్తవంగానూ, ప్రపంచం అవాస్తవంగానూ అనిపించాలి. ప్రపంచం కంటే పరమాత్మ యథార్థమైనవాడు అని విశ్వసించలేకపోతే, అద్వైత వేదాంతులం కాలేము సరికదా, ద్వైతభావనలున్న భక్తులం కూడా కాలేము. ద్వైతభావనలున్న భక్తులు కూడా ప్రపంచం, పరమాత్మ కంటే తక్కువస్థాయికి చెందిన సత్యం అని విశ్వసిస్తారు. పరమాత్మే శాశ్వతుడు, అమరుడు. ప్రపంచంలోని ఏ మత ధర్మ

మయినా, పరమాత్మే ప్రపంచం కంటే యథార్థమైనవాడని ప్రకటిస్తుంది.

ఓం - ప్రథమం నుంచీ, అద్వైత వేదాంతం, ప్రపంచం అనిత్యమనీ, పరమాత్మే నిత్యమనీ నొక్కి వక్కాణిస్తుంది. ద్వైత మతం ప్రపంచాన్ని వాస్తవంగా ముందు భావించినా, తర్వాత ఆ వాస్తవికతను ఉత్పత్తి చేసిన పరమాత్మను అన్వేషిస్తుంది. ఏ ధర్మం అనుసరిస్తున్నా, మహాచైతన్య స్థాయికి చేరిన సాధకుని దృష్టి నుంచి ఈ దృశ్యమాన ప్రపంచం తొలగిపోతుంది. మనలోని జీవాత్మ, మనల్ని సృష్టించిన పరమాత్మల మధ్య సంబంధాన్ని నిర్వచించే పదాలే ద్వైతం, అద్వైతం. ఈ ముఖ్యమైన విషయాన్ని మనం మరచిపోకూడదు. ప్రపంచం నిత్యం లేదా అనిత్యం అన్న విషయం మీద తలబద్ధలు కొట్టుకునే బదులు, శాశ్వతుడు, దివ్యత్వపు పెన్నిధి అయిన పరమాత్మతో మనల్ని అనుసంధానించుకోవడానికి ప్రయత్నం చేయాలి.

మనల్ని పరమాత్మతో అనుసంధానించుకోవడం ఎలా? ఇదే ఆధ్యాత్మిక జీవితపు లక్ష్యం. ఈ లక్ష్యానికి చేరువ అవుతున్నకొద్దీ, మనలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. జ్ఞానం, స్వేచ్ఛ ప్రాప్తిస్తాయి.

మనపట్ల మనకున్న దృక్పథాన్ని మార్చుకోవడంలోనే అసలు రహస్యం దాగి ఉంది. మన శరీరాలతో మనం తాదాత్మ్య చెందితే, ఈ ప్రపంచపు ప్రాపంచికతలో పూర్తిగా మునిగిపోతాము. మనల్ని జీవాత్మలుగా భావించుకున్నప్పుడే పరమాత్మ మనకు నిత్యసత్యంగా గోచరిస్తాడు. మనల్ని మనం శరీరస్థాయి నుంచి విడుదల పొంది, మనం స్త్రీ పురుషులం కామనీ, కర్తలం లేదా భోక్తలం కామనీ అనుకునే స్థాయికి చేరడం ఎలా? ఈ భావనలకు వ్యతిరేకమైన భావాలను బలంగా మనలో ప్రవేశపెట్టుకోవాలి. మన నిజస్వరూపం ఏమిటో మనకి మనమే తెలియజెప్పుకోవాలి. మనం ఆత్మస్వరూపులమన్న భావన బలంగా తయారవ్వాలంటే, దానివల్ల తక్కిన భావనలన్నీ పూర్తిగా సమసిపోవాలి. ద్వైత మార్గాన్ని లేదా అద్వైత మార్గాన్ని, నిజానికి ఏ మార్గాన్ని అనుసరించేవారయినా, ఇలా చేయకతప్పదు. మనశ్శరీరాలకు అతీతమూ, స్వయం ప్రకాశకమూ అయిన ఆత్మనే నేను అన్న నిర్ధారణకు నిష్కర్షగా రావాలి. మనస్సులో ఈ భావము లోతుగా





పాతుకుపోవాలి. తద్వారా జీవితం పట్ల దృక్పథం మారిపోవాలి.

పవిత్రతను సాధించడంలోని రహస్యం ఇక్కడే ఉంది. మన నిజతత్త్వం పరమ పవిత్రమైన ఆత్మతత్త్వం. ఈ విషయాన్ని గుర్తెరగకుండా, ఎంత ప్రయత్నించినా పవిత్రతను సాధించలేము. నిజానికి, మనలోని ఆత్మను మనస్సు, ఇంద్రియాలు, శరీరం వగైరాలకు ఆపాదించడమే అపవిత్రతకు కారణమవుతున్నది.

బాలవాణి

# చిలుక చెప్పిన పాఠం

- కె. కౌండిన్య తిలక్

ఒక అరణ్యంలో పుష్కలమైన ఫలపుష్పాదులతో నిండిన ఓ మహావృక్షం ఉండేది. ఆ చెట్టు తొర్రలో ఓ పక్షి ఆ మానునే ఆధారంగా చేసుకొని నివసిస్తుంది. వేటగాళ్ల దాడులను తట్టుకుంటూ, ఆ చెట్టు గూటిలోనే రక్షణ పొందుతూ ఉంటుంది. ఎక్కువగా ఆ మాను ఫలాలనే తింటూ ఆకలి తీర్చుకుంటూ ఉంటుంది. అలా ఆ పక్షికి ఆ వృక్షంతో తెలియని అనుబంధం పెనవేసుకుపోతుంది. ఆ చెట్టుతోపాటే వసంతంలో ఆనందంగా, గ్రీష్మంలో నిబ్బరంగా ఆ చిలుకా కాలం గడపసాగింది.

ఇలా ఉండగా ఒకరోజు ఓ వేటగాడు ఆ అరణ్యంలోకి ప్రవేశించాడు. విషం పూసిన బాణాలు ప్రయోగిస్తూ ఆ అడవిలో మృగాలను వేటాడుతూ ఉన్నాడు. ఓ జింకను చంపేందుకు వేసిన విషపూరితమైన ఆ బాణం పొరపాటున, చక్కని ఫలపుష్పాదులతో శోభాయమానంగా ఉన్న ఆ చెట్టుకు గుచ్చుకుంటుంది. ఆ విషప్రభావానికి వెంటనే ఆ వృక్షం ఆకులూ, పండ్లూ అన్నీ రాలిపోయి, మోడుబారిపోతుంది. ఉదయమంతా ఎక్కడెక్కడో ఎగిరి, సాయంకాలానికి తమ ఆశ్రయం పొందిన ఆ చెట్టు వద్దకు వచ్చిన పక్షికి ఆ మాను అలా మోడుబారిపోవడం బాధ కలిగిస్తుంది. చుట్టుప్రక్కల ఎన్ని చెట్లున్నా, అది మాత్రం ఎండిన ఆ వృక్షాన్నే నమ్ముకొని

ఉండసాగింది. ఎప్పటికైనా ఆ మాను మారాకు వేయకపోతుందా? అన్న నమ్మకంతో, ఎక్కడికీ ఎగిరిపోకుండా ఆ తొర్రలోనే నివసిస్తూ, ఆహారాదులు లేక అది కూడా కృశించిపోసాగింది.

ఆ పక్షిని స్వర్గంలోంచి దేవేంద్రుడు గమనించి ఆ చిలుక ఎందుకు ఆ చెట్టును విడిచిపెట్టటం లేదో తెలుసుకుందామని, బ్రాహ్మణ వేషంలో ఆ చిలుక దగ్గరకి వచ్చి 'నువ్వు పక్కనే ఇన్ని మంచి చెట్లుండగా ఈ ఎండిపోయిన చెట్టునే ఆశ్రయించుకొని ఉన్నావెందుకు? అని ప్రశ్నిస్తాడు.

అప్పుడు ఆ చిలుక తన పూర్వజన్మ తపశ్శక్తితో బ్రాహ్మణ వేషంలో వచ్చిన ఇంద్రుణ్ణి గుర్తుపట్టి, ఆయనకు నమస్కరిస్తూ ... **అనయం పండు చుండునెడ నాశ్రయమొప్పిన నిల్చి, యెండి పోయినతణి బాసిపోక తగవెట్లు కృతఘ్నత గాదె యివ్విధంబనిమిషనాథ!**

'శచీపతీ! ఈ వృక్షం ఫలపుష్పాదులతో నిండి ఉన్నప్పుడు దీనిని ఆశ్రయించి బతికిన నేను, ఈనాడు చెట్టును ఈ దుస్థితిలో విడిచిపెట్టి వేరొకచోటికి వెళ్ళిపోవడం కృతఘ్నత కదా!' అని అంటుంది.

చిలుక కృతజ్ఞతాభావానికి ఇంద్రుడు సంతోషించి 'నీకేమి వరం కావాలి?' అని అడుగుతాడు. అప్పుడు ఆ చిలుక 'దేవేంద్రా! ఈ వృక్షాన్ని మళ్ళీ జీవించేట్లు చేసి, పూర్వవైభవాన్ని ప్రసాదించు!' అని కోరుతుంది.

అప్పుడు ఇంద్రుడు చిలుక హృదయవైశాల్యానికీ, ప్రత్యుపకారబుద్ధికీ మెచ్చి ఆ వృక్షం మీద అమృతం చల్లుతాడు. వెంటనే ఆ మాను యథాపూర్వంగా పత్రపుష్ప ఫలాదులతో నిండి మనోహరంగా మారిపోతుంది.

నీడనిచ్చినందుకు ఆ చిన్నపక్షే చెట్టుపై అంత కృతజ్ఞత చూపినప్పుడు, మనకు ఎన్నోరీతుల్లో సాయపడుతున్న సాటిమానవుల ఎడల మనం ఎంత కృతజ్ఞతా భావంతో మసలుకోవాలి!

'ఆశ్రయభూతులైన వారి పట్ల ఆశ్రితులు ఏ విధంగా కృతజ్ఞతాభావంతో మసలుకోవాలో తెలుపమ'ని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు మహాభారతం, అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసంలో వివరించిన కథ ఇది.







# అక్రోధం

- పరమపూజ్య శ్రీశ్రీశ్రీ రామకృష్ణానంద స్వాములవారు

(జనప్రియ గీతోపన్యాసం నుండి)

దైవాసుర సంపద్విభాగ యోగంలో దైవీ లక్షణాల్లో ఒకటిగా 'అక్రోధం' చెప్పబడింది. అక్రోధం, క్రోధం లేకుండా అక్రోధం. క్రోధమనినా కోపమనినా ఒక్కటే. కోపము పాపము, కోపమొక విషము. ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుంది. కోపమొక పిచ్చి. కోపి ఆవేశంలో ఏమో చేసి పశ్చాత్తాపం పడ్తుంటాడు. కోపంలో కోసిన ముక్కు శాంతంలో రాదు. కోపం వచ్చినప్పుడు నీ ముఖం అద్దంలో చూచుకో! కోపం వస్తే నేను మనిషిని కాదు సుమా!" అని అంటుంటాడు. అప్పుడు వాడు భూతమైపోతాడని అర్థం. ప్రబోధ చంద్రోదయ నాటకంలో క్రోధుడు తన ప్రభావాన్ని తానే స్వయంగా యిలా చెప్పకున్నాడు.

**"అంధీకరోమి భువనం బధిలీకరోమి**
**ధీరం సచేతన మచేతనతాం నయామి!**
**కృత్యం నపశ్యతి నయోనహితం శృణోతి**
**ధీమానధీత మపిన ప్రతి సందధాతి" ॥**

"నేను ఆవేశించానంటే కళ్ళు వున్నా గ్రుడ్డివాడౌతాడు. చెవులున్నా చెవిటివాడైతాడు, తెలివి ఉండి తెలివిలేనివాడైతాడు, మంచి చూడలేడు, మంచి వినలేడు, చదివిన చదువులు ఒక్కటీ పనికిరాదు". ఇది క్రోధ భూతము యొక్క ఆవేశ ప్రభావము.

కోపము చండాలుడు, చండాలుని తాకితే స్నానం చేస్తాము. అట్లే కోప స్పర్శ అయితే వెంటనే స్నానం చెయ్. అది కూడా శాంతిస్తుంది.

గంగలో స్నానం చేసి బ్రాహ్మణుడు పైకి వచ్చాడు. ఒక చండాలుడు పైతట్టు స్నానం చేసి వాడూ బైటికి వచ్చాడు. "ఛీ! ఛీ! చండాలస్పర్శ అయిం'

దని చెడబడా తిట్టూ బ్రాహ్మణుడు మళ్లీ స్నానానికి వెళ్లాడు. "నాకూ కోప చండాలుని స్పర్శ అయింద'ని వాడూ స్నానానికి దిగాడు. ఒకడు జాతి చండాలుడైతే-ఒకడు కోప చండాలుడు.

కబీరుదాసు ప్రఖ్యాతిని విని ఆయనను చూడాలనే అభిప్రాయంతో ఒక ఫకీరు కబీరుగారి కుటీరానికి వచ్చాడు. కబీరు కావలిసే తన కుటీరం ముందు ఒక పందిని కట్టేసిపెట్టాడు. అది చూచి ఫకీరు అగ్గై మండాడు. "ఏమి ముసల్మానువయ్యా నీవు? హరామ్‌ను ఇంటి ముందు పెట్టుకొన్నా"వని చెడాబడా అరిచాడు. "అయ్యా! నేను 'హరామ్'ను బైట కట్టేశాను నిజమే, నీవు లోపలనే కట్టేసుకున్నావే" అని అడిగాడు. "హరామ్" అంటే మహమ్మదీయ భాషలో పంది అని, కోపం అని రెండర్థాలు ఉన్నాయి. ఆ మాట విని ఫకీరు కబీరు గొప్పతనానికి భక్తుడైనాడు.

క్రోధము హృదయంలో క్షోభను కల్గిస్తుంది. చిన్న పాత్రలు తొందరగా వేడెక్కుతాయి. చిన్న హృదయాలకు తొందరగా కోపం వస్తుంది. అంధుని పిక్కబలమువలె క్రోధాంధుని వివేక బలం వ్యర్థము. క్రోధము మానసిక సమతోలనాన్ని భంగం చేస్తుంది. క్రోధము ఇహపరాలకు బాధాకరము. క్రోధానికి వశము కారాదు. క్రోధము రాకుండానే ఉంటే మంచిది. వచ్చిందా- మ్రింగేసేటట్లుండాలె. ఇంటిలో ప్రవేశించే వాళ్లను గమనించి లోపలికి వదిలినట్లు హృదయంలోకి ప్రవేశించే గుణాలను గమనించి లోపలకు వదుల్తూ రావలె, ఈ అభ్యాసంతో వాటి బలం తగ్గుతుంది. కోపము నీకు తప్పకుండా ఉంటే, ఆ కోపాన్ని కోపం మీదనే చూపు - అంటూ ఒక మహానుభావుడన్నాడు. కోపం వచ్చినప్పుడు పది వరకు లెక్కించు, దాని వేగం తగ్గుతుందని ఒకాయన అన్నాడు.

"కరువ వద్దని చెప్పాను కాని బుస్సని అనవద్దని చెప్పానా" అని నారదుడు పాముతో అన్నట్లు ఒక కథ ఉంది. దానిలోని అర్థం కూడా క్రోధానికి వశము కావద్దు అనే.





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

వారిలో తమ తమ ఇంటి స్త్రీలకు ఎందరు స్వాగతించి తమ కుటుంబాలలో ఆశ్రయమిస్తారు? వారినే విధంగా చూస్తారు! రుక్మిణీదేవిని, తనను ఈ కృష్ణస్వామి కనికరించకపోతే తమ బ్రతుకులు ఏమయ్యేవి? సత్యలో స్త్రీ సహజమైన సానుభూతి, దిగులూ సుళ్లు తిరిగాయి.

ఆమె ఆలోచనల సుడిగుండంలో చిక్కుకున్నది. 'ఆయనకందరూ సమానులే. తమను ఆయనకు నిర్మమంగా నిరపేక్షంగా అర్పించుకోవడమే. తిరిగి కోరడం అంటూ లేని సర్వస్వార్పణం-అప్పుడే ఆయన కనికరించేది. అలా సంపూర్ణంగా సమర్పించుకుంటే ఆయన ఈయలేనిది ఏమున్నది!

మణిపురం చేరేటప్పటికి పశ్చిమాన సూర్యుడు కొండలచాటుకు వెళ్లి పోతున్నాడు. క్రమంగా చీకట్లు వ్యాపిస్తున్నాయి. ముందుగా వెళ్లిన చారుడు శ్రీకృష్ణుల వారి రాకను చిత్రవాహనునికి తెలియజేశాడు.

చిత్రవాహనుని ఆనందానికి హద్దులు లేవు. శ్రీకృష్ణుడనుకున్నట్లే, ఏ ఆడంబరమూ, ఆర్భాటమూ లేకుండానే స్వాగతించాడు. కాని ఆ స్వాగతంలో పాదాలను నీటితో కాక కన్నీటితో కడిగాడు. అప్పటికే అక్రూర, ఉద్ధవుల సంపర్కంలో అతని గుండె కృష్ణమయమైంది. అతని అంతఃపురం శ్రీకృష్ణ భక్తిసదనమైంది. చిత్రవాహనుని భార్యలు సత్యభామను అపూర్వంగా స్వాగతించి, గౌరవించారు.

అక్కడ మూడు రోజులు ఎలాంటి సందడీ లేకుండా గడిచాయి. వైన తేయుడు వచ్చి బహుళ చతుర్దశినాడు తెల్లవారక ముందే బల్లకట్టు దగ్గరకు గరుడదళం చేరడానికి ఏర్పాట్లైనాయన్నాడు.

మణిమానుడు అపహృత స్త్రీల సంరక్షణకు వ్యూహం పూర్తయిందని నివేదించి, ఉద్ధవుడు, నాగులు ఏ నిముషాననైనా లోహితనదీ తీరాన స్థావరాలను స్వాధీనం చేసుకోగలరన్నాడు.

అక్రూరుడు పదహారు వేల నూరు మంది స్త్రీలు, వేలాది శ్రోత్రియులు వాసుదేవ నామస్మరణంతో గడియకొక యుగంగా గడుపుతున్నారన్నాడు.

✡ ✡ ✡

అశ్వయుజ బహుళ ద్వాదశినాడు చిత్రవాహనుడు ముందుగానే తనకు విశ్వాసపాత్రులైన యోధులను నూర్గురుని రహస్యంగా ప్రాగ్జ్యోతిష సమీపారణ్యాలలోకి పంపాడు. అక్కడిదాకా దారిని నిశ్చయించి, వేగవంత ములైన అశ్వాలను పూన్చిన రథాన్ని నడిపించే దగ్గర దారిని నిర్ణయించారు.

బహుళ చతుర్దశి. చీకట్లను చీల్చుకుంటూ ప్రాగ్గర్భంలో నుండి సహస్ర కిరణాల అరుణరాగాలతో సూర్యుడు ప్రాగ్దిశాజ్యోతిషమూర్తియై ప్రాగ్జ్యోతిష నగరాన్ని తమో గర్భంలోంచి వెలికి రప్పిస్తున్నాడు. ఉదయం బాగా ప్రొద్దెక్కిన దాకా నగరంలోకి రాకపోకల సందడి విపరీతంగా ఉంటుంది. వణిక్కులు తమ సరుకులను బండ్లలో తీసుకుని వస్తారు. కంచరగాడిదలతో, ఏనుగు లతో సరుకులు చేరవేసేవారు వస్తారు. వందలాది తైర్థికులు, నగరంలోని ప్రజల బంధువులు వస్తుంటారు. జనసంచారం వేలలో జరుగుతుంది. ఆ సమయం నాలుగైదు ఘడియలు దాటితే లోనికి అగడ్త మీదుగా పోయే వంతెనలను ఎత్తివేస్తారు. కనుక జనసమ్మర్దపు కోలాహలం విపరీతంగా ఉంటుంది.

నరకాసురుని రాజ్యంలోకి అక్రమంగా చొరబడడమంటే మృత్యువును బొట్టుపెట్టి ఆహ్వానించుకోడమే. మురాసురినికి ఏడుగురు కుమారులు- తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణుడు, విభావసుడు, వసుడు, నభస్వంతుడు, అరుణుడు. ఏడుగురూ యోధులే. తండ్రికి పరిఖా పరిరక్షణకు సహక రిస్తుంటారు. ఎవరో నరకుని శాసనాన్ని ధిక్కరించి నగరంలోకి చొరబడి రావచ్చుననే అనుమాన భయాలు లేని దుర్గమ గిరి దుర్గమది. కనుక





నిత్యము దుర్గంలోకి జరిగే రాకపోకల విషయంలో ఏదో ఆపద రావచ్చు ననే శంక వారికి లేదు. పైగా వంతెన దాటి లోనికి ప్రవేశించే ముందు ఎవరివద్దా ఏ ఆయుధమూ ఉండరాదు. అక్కడ ఉండే రక్షకులు కలిసంగా పరీక్షించిన తరువాతే లోపలికి ఎవరినైనా వదులుతారు.

ఆ రోజు ఉదయమే జనంతో కలిసి నాగులు, గరుడులు వివిధ వేషా లతో బయలుదేరారు. ముందు కొందరు సాధువులుగా, తైర్థికులుగా లోనికి ప్రవేశించగానే ఇరవై, ఇరవై ఐదుగురు సాధువులు లోనికి ప్రవేశించి చెక్కబల్లనెత్తే యంత్రం ఉన్న దుర్గంలోని పార్శ్వకక్ష్యలోనికి చొరబడి, అక్కడ ఉన్న ముగ్గురు రక్షకులను కేవలం పిడికిటి పోట్లతో యమసదనా నికి పంపారు.

ఆ వెనుక వచ్చే సాధువులు హఠాత్తుగా శంఖనాదాలు చేశారు. జనంలో త్రొక్కిడి మొదలైంది. వెనుక నుంచి నాగులు, గరుడులూ తమ ధనువుల నుండి విడిచిన బాణపరంపరను, లోనికి వచ్చే వారినీ ఆపడానికి ప్రయత్నించేలోగా వంతెనపై ఘర్ఘరధ్వానం, డెక్కల చప్పుడు విన్పించాయి. విల్లెక్కుపెట్టి బాణసంధానం చేసిన, సత్య కన్నులు అగ్నికణాలుగా మండు తున్నాయి. మోము జేవురించింది. సిగ ముడివేసి, చీరను బిగపట్టి, కొంగు బిగించి వీర రసాధిదేవతగా, సాక్షాత్తాదిశక్తిగా ఆమె శరపరంపరను గుప్పించడానికి సిద్ధంగా ఉన్నది.

రక్షకులు అవరోధిస్తున్నా, రథం దారకుని సారథ్యంలో వంతెన దాటి నరకుని దుర్గ ద్వారంలోనికి ప్రవేశించింది.

అప్పుడు కృష్ణుడు తన పాంచజన్యాన్ని తీసుకొని, అతి భయంకరంగా, ప్రళయఘోషలా ధ్వనింపజేస్తూ ఊదాడు. ఆ శంఖధ్వని భయంకరమై ప్రాగ్జ్యోతిష నగరంలో, మురాసురాదుల చెవులకు, నరకాసురుని శ్రవణా లకు మృత్యుఘోషలా వినిపించింది.

**(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

అవతార పురుషులకు, మహనీయులకు, దైవాంశ సంభూతులకు మరణమన్నదే లేదు. వారి అవతార కార్యము ముగిసిన పిమ్మట అతి సునాయాసంగా దేహమును పరిత్యజించి వారి నాశ్రయించిన వారిని సదా రక్షించుట కొరకు ఎల్లవేళలా జాగరూకులై ఉందురు. వారి జనన మరణాలు మానవ మాత్రులమైన మనకు ఊహకందనివి. మృత్యువే వారి చెంత చేర భయపడుతుంది కాని వారు మాత్రం మృత్యువుకు భయపడరు. వారు ఆహ్వానిస్తే తప్ప మృత్యువు సహితము వారి ఛాయలకు చేర సాహసించలేదు. జన్మించిన ప్రతి ప్రాణి మరణించాలన్న ప్రకృతి ధర్మానికి కట్టుబడి మాత్రమే వారు దేహత్యాగం చేస్తారు. పరిపూర్ణ అవతార పురుషులు, అవధూతలు వారి మహా సమాధి అనంతరమే అసంఖ్యాక లీలలను ప్రకటించి సర్వదా వారి భక్తులనుద్ధరింతురు. భగవంతుని యొక్క పరిపూర్ణ కృపకు పాత్రులైన భక్తులకు మరణముండదని ఈ సృష్టి ఉన్నంత వరకు వారు ఉంటారని, నామదేవు, గోణాయి, తుకారాం, రామదాసాది భక్తుల జీవితాలు చాటి చెపుతున్నాయి. సూర్యకిరణాలు సూర్యుని నుంచి దూరం కానట్లు, వెన్నెల చంద్రుని నుంచి దూరం కానట్లు, భగవంతుడు తన భక్తులకు దూరం కాకపోగా వారి హృదయాలలోనే స్థిర నివాస మేర్పరచుకుంటాడు. భగవంతునికే వారి హృదయంలో ఆశ్రయ కల్పించిన వారి చెంతకు మృత్యువు చేర సాహసించునా! మాయా ప్రభావితులైన మానవులు మహనీయులు జనన మరణాల కతీతులని గ్రహించి లేక వారు మరణించారనియు, మహా సమాధి చెందారని తలుస్తారు. భగవద్భక్తులెప్పడు మృత్యుంజయులే.





బాబా సమాధి చెందటానికి కొన్ని సంవత్సరాల ముందే వారు సమాధి చెందు విషయాన్ని భావ గర్భితంగా వెల్లడించినా బాబా మహా సమాధి చెందిన తరువాత మాత్రమే వారి మాటల కర్థం స్ఫురించింది వారి భక్తులకు. మన స్వామీజీ మహా సమాధి చెందు విషయాన్ని అవధూతలు సహితం ముందుగానే సూచించారు. మరి కొంతమందికి స్వామీజీ స్వప్నంలో తాము సమాధి చెందు విషయాన్ని ముందుగానే సూచించారు. 1995 సెప్టెంబరు మాసంలో మణి అనారోగ్యంతో బాధపడుతుంటే స్వామీజీ అతనిని దత్తావధూత సతీ అనసూయ మాత దర్శనానికి పరాడ్శింగా పంపగా అనసూయ మాత షిరిడీ పీఠం ఐదు మాసాల్లో ఖాళీ అవుతుందని సైగల ద్వారా తెలియజేశారు. మణి తాను అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఐదు మాసాలలో తానే మరణిస్తానని తలంచాడు. కానీ, ఐదు మాసముల తరువాత ఫిబ్రవరి 12 తేది 1996న స్వామీజీ సమాధి చెందిన తరువాత గానీ అతనికి అనసూయ మాత చెప్పినది అర్థం కాలేదు.

షిరిడీ నివాసి పి.యస్.రావుకు స్వామీజీ స్వప్నంలో దర్శనమిచ్చి తాము మహా సమాధి చెందు విషయాన్ని ఈ క్రింది విధంగా తెలియజేసారు. అతనికి స్వప్నంలో సాయినాథుడు ఒక ఆసనం మీద ఆశీనులై దర్శనమిచ్చారు. అటు పిమ్మట కొద్ది క్షణాల్లోనే అదే ఆసనం మీద స్వామీజీ దర్శనమిచ్చారు. తరువాత సాయి మరియు స్వామీజీ ఆ ఆసనానికి ఇరువైపులా నిలబడి దర్శనమివ్వగా ఖాళీ అయిన ఆసనాన్ని చూసిన రావు ఆ ఆసనాన్ని ఏమి చేయమంటారని స్వామీజీని ప్రశ్నించగా "దానిని ఆశ్రమంలో పెట్టు" అని చెప్పారు. దీనినిబట్టి స్వామీజీకి తాము శరీర త్యాగము చేస్తున్న సంగతి ముందుగానే తెలుసుననియు, తరువాత తాము సూక్ష్మ రూపంలో ఆశ్రమంలో ఉంటారని ముందుగానే సూచించారు.

బాబా మహాసమాధి చెందటానికి 17 రోజుల ముందు నుంచి

ఆహారాన్ని విసర్జించి విజయదశమి పర్వదినాన మహాసమాధి చెందగా, స్వామీజీ కూడా తమ మహా సమాధికి 17 రోజుల ముందు నుంచి అన్న పానీయములను విడనాడి ఫిబ్రవరి 11వ తేది ముగిసి 12వ తేది ప్రవేశించిన 10 నిముషాలకు మాఘ బహుళ సప్తమి, సోమవారం అంతిమ శ్వాస విడచి సాయి పవిత్ర పాద సన్నిధికి చేరుకున్నారు.


సుమారు నాలుగున్నర దశాబ్దాలు నిస్వార్థ సాయి సేవలో గడిపి అతి నిరాడంబర జీవితాన్ని కొనసాగించి సాయి ఉచ్ఛిష్టంతోనే క్షుద్బాధను తీర్చుకుని, సాయి పాదోదకంతో దాహం తీర్చుకుని, బాబా సంచరించిన పరమ పవిత్ర ప్రదేశాల్లోనే సంచరించి, సాయి తత్వాన్ని దేశ, విదేశాలలో సహితం ప్రచారం చేసిన పుణ్యమూర్తి శ్రీ శివనేశన్ స్వామీజీ అంతిమ శ్వాస విడిచారన్న సంగతి తెలుసుకొని వారి భక్తులందరు షిరిడీ చేరి తమ గురుదేవులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రతి నిత్యం భక్తుల కోలాహలంతో సాయి నామ సంకీర్తనలతో కళ కళ లాడే షిరిడీ పురం ఆనాడు కళావిహీనమై, నిస్తేజమై, అమావాస్య నాటి అంధకారాన్ని తలపిస్తూ, ఇది షిరిడీ పురమా లేక శోకసంద్రమా అన్న రీతిన గోచరించింది. ఎవ్వరి ముఖంలోనూ కళాకాంతులు లేవు. వెక్కి వెక్కి ఏడ్చేవారు కొందరైతే వారిని ఓదార్చే వారు మరికొందరు. స్వామీజీ ప్రతిభా పాటవాన్ని కొనియాడే వారు కొందరైతే స్వామీజీకి బాబా యందుగల భక్తి, శ్రద్ధలను మననం చేసుకొనే వారు మరికొందరు, “నా తండ్రిలేని ఈ లోకంతో నాకేమి పని అని విలపించే పుత్రసమానులు కొందరు. నా గురువు సద్గురు సన్నిధికి చేరుకున్నారు, నా అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే దెవరని రోదించే శిష్యులు కొందరు, నా దైవమే లేని నా యీ  జీవితమెందుక”ని విలపించే భక్తుల ఆర్తనాదాలతో షిరిడీ పురము కళా కాంతులు కోల్పోయినది.

(సశేషం)







# సాయి భక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

ఆ అధికారి విచారణ జరిపి, “గ్రామ మునిసిఫ్ స్టేషనులో డబ్బు జమ చేసాడని, కానీ, ఆ డబ్బులు ప్రభుత్వానికి అందలేదని, అందుకు బాధ్యుడు ఆ రోజు స్టేషను బాధ్యతను చూస్తున్న గణపతిరావని” ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాడు.

తన ప్రమేయం లేకుండానే అంతా జరిగిపోవడంతో దాసగణు ఖిన్నుడయ్యాడు. ఇక ఏ విధంగా చూసినా తాను పదోన్నతి పొందే అవకాశం లేదు. అసలు పదోన్నతి పొందే సంగతి దేవుడెరుగు, ముందు జైలుశిక్షను తప్పించుకునే అవకాశాలే మృగ్యంగా కనపడసాగాయి. అప్పుడు దాసగణుకి జరుగుతున్నదంతా బాబా లీలా వినోదమనే విషయం అర్థమైంది. వెంటనే శిరిడీ వెళ్ళి బాబా చరణాలను ఆశ్రయించాడు. “బాబా ఎన్నోసార్లు పొరపాటు నావైపు ఉన్నా, మీరు నన్ను రక్షించారు. ఇప్పుడు నేను ఏ తప్పే చేయకపోయినా నన్ను శిక్షిస్తున్నారు. నాపై దయ ఉంచి నన్ను ఈ సంకటం నుండి గట్టెంకించండి. మీ పాదాల మీద ప్రమాణం చేసి చెపుతున్నాను. ఈసారి కచ్చితంగా ఉద్యోగం వదిలేస్తాను” అని వేడుకున్నాడు.

ఆ తరువాత, దాసగణు నీతి నిజాయితీలు మరియు మచ్చలేని నడత వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఈ కేసు విషయమై మరలా పునర్విచారణకు ఆదేశించింది. ఆ పునర్విచారణలో బంట్రోతు డబ్బులు జమ చేసినప్పుడు గణపతిరావ్ స్టేషనులో లేడని, కనుక బంట్రోతు నుండి డబ్బులను స్వీకరించిన పోలీసు సిపాయే వాటిని తస్కరించాడని తేలింది. దాంతో దాసగణు ఆ సంకటం నుండి నిర్దోషిగా బయటపడ్డాడు.

ఇక ఏమాత్రం ఉద్యోగంలో కొనసాగకూడదని దృఢ నిశ్చయం చేసుకొని, తన రాజీనామా పత్రాన్ని పై అధికారులకు పంపించాడు. ఆ పై అధికారి వ్యక్తిగతంగా దాసగణుని పిలిపించి "పిచ్చివాడిలా ప్రవర్తించకు. ఒక పిచ్చి ఫకీరు మాయలో పడి ఎంతో భవిష్యత్తున్న ఉద్యోగాన్ని వదులుకొంటావా?" అని వారించేందుకు చాలా ప్రయత్నం చేసారు. కానీ, తన నిర్ణయం మార్చుకోనని దాసగణు తేల్చిచెప్పడంతో చివరకు దాసగణు రాజీనామాను ఆమోదించక తప్పలేదు. ఆ విధంగా దాసగణుకు పదకొండు సంవత్సరాల పోలీసు ఉద్యోగంతో శాశ్వతంగా సంబంధం త్రెగిపోయింది.

తమతో జన్మజన్మల సాంగత్యం కలిగిన సద్భక్తుడు పోషించవలసిన పాత్రను ఆ సమర్థ సద్గురుడు ముందరే నిర్ణయించి ఉంటారనే సత్యానికి దాసగణు జీవితం ఒక సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. "ఒక నెల జీతంతో ఏమవుతుంది గణపతిరావ్, నేను నీ మొత్తం ఉద్యోగాన్నే గురుదక్షిణగా తీసుకుంటాను. కానీ, దానికి ఇంకా సమయం ఉంది" అని శ్రీ వామన శాస్త్రి ఉద్గారించిన వాక్యాలను మరియు తరువాతి రోజులలో "గణూ, నీవు చేయవలసింది వేరే ఉంది, ఇక నీవు ఉద్యోగాన్ని వదిలేయ్" అనే బాబా ఆదేశాన్ని నిశితంగా పరిశీలించితే, శ్రీ వామనశాస్త్రి గారి ముఖతః శ్రీ సాయియే స్వయంగా పలికారని మరియు సమర్థ సద్గురుడైన శ్రీ సాయి తమ సద్భక్తుని పారమార్థిక పురోగతిని గావించే తమ కార్యాచరణలో శ్రీ వామనశాస్త్రిని పాత్రధారిని చేసారని మనకు బోధపడుతుంది. తద్వారా దాసగణు పారమార్థిక జీవితాన్ని అంతా తామై శ్రీ సాయి మలచిన వైనం గోచరమవుతుంది.

శ్రీ వామనశాస్త్రి గారు మంత్రోపదేశం చేసేటప్పుడు, రెండు పైసలను దక్షిణగా స్వీకరించిన వివరాన్ని ఇంకొంచెం లోతుగా విశ్లేషించినట్లయితే, పారమార్థిక పురోగమనానికి అత్యంత ఆవశ్యకమైన "శ్రద్ధ సబూరీలనే" రెండు పైసల రూపంలో ఆయన దక్షిణగా అడిగారని మనకు అవగతమవుతుంది. బాబా తమదైన నర్మగర్భశైలిలో ప్రతి ఒక్క భక్తుని నుండి శ్రద్ధ మరియు సబూరి (సంతోషంతో కూడిన ఓరిమి)లను వ్యవహారిక భాషలో





రెండు పైసలుగా అడగడం సాయి భక్తులకు విదితమే! అంతేకాదు, **"నా నుండి నా గురువు ఇంకేమి ఆశించలేదని, కేవలం శ్రద్ధ సబూరీలనే రెండు పైసలను మాత్రమే ఆశించారని, నేను వాటినే నా గురువుకి సమర్పించానని"** అనే బాబా ఉపదేశంలో గురువు పట్ల శ్రద్ధ సబూరీలను కలిగియుండటం ఎంత ఆవశ్యకమో తేటతెల్లంగా తేల్చిచెప్పారు. శ్రీ వామన శాస్త్రి కూడా మంత్రోపదేశ సమయంలో సరిగ్గా రెండు పైసలనే దక్షిణగా స్వీకరిస్తూ "ఉద్యోగాన్ని దక్షిణగా సమర్పించవలసినదేనని, కానీ, దానికి ఇంకా సమయముందని, ప్రస్తుతానికయితే రెండు పైసలను దక్షిణగా సమర్పిస్తే సరిపోతుందని" చెపుతూ, సరిగ్గా పై సత్యాన్నే నిగూఢ రీతిలో దాసగణుకి నొక్కి వక్కాణించారు. తద్వారా ఆయన దాసగణును సాయి మార్గంలోనికే ప్రవేశ పెట్టారని నిర్ధారణ అవుతుంది. దాసగణు పారమార్థిక జీవన సూత్రధారి శ్రీ సాయియేయని, దాసగణులో శ్రద్ధాభక్తులను దృఢం చేసే క్రమంలో శ్రీ వామనశాస్త్రి, రామయ్య వంటి మహనీయులను తమ సంకల్పానుసారం పాత్రధారులను చేసారని మనకు రూఢి అవుతుంది.

"మొత్తం ఉద్యోగాన్నే గురుదక్షిణగా సమర్పించవలసి ఉంటుందని, కానీ, దానికి ఇంకా సమయం ఉందని, ప్రస్తుతానికయితే రెండు పైసలను దక్షిణగా సమర్పించమనే" శ్రీ వామనశాస్త్రి మాటలను ఇంకా విస్తృతంగా వివేచన చేసినట్లయితే "నీవు ఏదో ఒకరోజు నీ ఉద్యోగాన్ని గురు ఆజ్ఞానుసారం వదులుకోవలసినదేనని" ఒక విధంగా తేల్చి చెప్పారు. అంతేకాదు, "నిన్ను భక్తి మార్గ పథికుడను చేసి, నీ నియోజిత సద్గురు చరణాల వద్దకు చేర్చడంతో, నా పాత్ర సమాప్తమవుతుందని, తరువాతి పారమార్థిక పురోగమనాన్ని ఆ సద్గురువు తమ ప్రత్యక్ష మార్గదర్శనం ద్వారా కొనసాగిస్తారని, కనుక నీవు ఆ గురుదక్షిణను (ఉద్యోగాన్ని) ఆయన చరణాలకే సమర్పించవలసి ఉంటుందని" పరోక్షంగా బోధించారని మనకు తరువాతి కాలంలో దాసగణు జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలను బట్టి మనకు తెలియవస్తుంది.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

## 9. హృదిన సాయి నిల్పి దృఢముగా కొలసిన

కం. అజ్ఞామంతరించును
సుజ్ఞానము గలిగిజనులు సుఖమును బొందున్
విజ్ఞత బాబా లీలలు
అజ్ఞానపు యీతిబాధలన్నియు దీర్చున్ 1

కం. శ్రద్ధయు భక్తియు నలవడ
శుద్ధపు చైతన్యప్రభలు చూడ్కొను గాదే
బుద్ధికి నావలి యాత్మకు
యుద్ధతియగుసాయి మనదు హృదయమునుండన్ 2

ఆ.వె. సాయి చరిత నెవరు శ్రద్ధతో చదువునో
సాయి కదల మనన శ్రవణమున్న
చేయువారి నడుపు చేయిపట్టి యతడు
వారి విడువ డెట్టి వారినైన 3

ఆ.వె. సాయినాధునందు సాగును దృఢమైత్రి
సాయి నామ మెపుడు సన్నుతించ
హృదయమందు సాయి హృద్యమై యుండగా
లోటురాదు యెపుడు లోకమందు. 4

ఆ.వె. భుక్తిముక్తి గల్గు భూరి సంపద గల్గు
శరణు జొచ్చిన వాని సాయి విడడు
వారి వారి పనుల వారిని నియమించి
పాపములను విఱచి పరము జేర్చు. 5





ఆ.వె. కాంతి కంభమతడు కాంతి బాటను జూపు
శంకలన్నియు దీర్చి శ్రమను దీర్చి
మోక్షగామి జేయు పుణ్యమానవుజేసి
సాయి భజన జేయ సాధ్య మిదియ. 6

ఆ.వె. మోక్షసాధనాలు పూజాది శమదమ
త్యాగములుగ యుగపు ధర్మమాయె
నాడు, కలియుగమున నాల్గు వర్ణములకు
భక్తి కీర్తనములె పరము లగును. 7

ఆ.వె. ధ్యాన ధారణములు ధరియించ కష్టము
శ్రవణ మననజేయ సాయి చరిత
సులభతరము గాదె సూటి మోక్షమునంద
ఆత్మ సాక్షి గనుము హృదిన సాయి. 8

ఆ.వె. సాయి మాత రోరి సాకును చక్కగా
తల్లిప్రేమ మించి ధరణిపైన
వేరు ప్రేమ లేదు వెదుకగా నెంతైన
సాయి నాత్మ నిలిపి సంతసించు 9

తే.గీ. కాచె రోహిల్ల మూర్ఖుని కష్ట మనక
సర్వప్రాణుల నొకరీతి సమత మమత
జూపి ఉదరాన నిలిపెను సాయి మాత
తల్లి సాయిప్రేమ యెపుడు తరగ దోయి 10

కం. ఉపదేశము సాయీశుని
ఉపమానములేని యంత ఉన్నత వాక్కుల్
అపవాదులు లెక్కించక
ఉపవాసము చేయుమయ్య ఉన్నతి గనగన్ 11

ఆ.వె. పరమ లోభివాడు పరగిన యెటులైన
ధరణి పూడ్చినట్టి ధనము విడడు
హృదిన సాయి నిల్పి దృఢముగా కొలసిన
నిన్ను యముడు గూడ నిలుప లేడు. 12

(సశేషం)

# మాతృసంస్థ కబుర్లు

మార్చి 20వ తేదీ ఫాల్గుణ బహుళ విదియ. తిథుల ప్రకారం మా గురుదేవులు శ్రీశ్రీశ్రీ పూజ్య స్వామి సత్యపదానంద ప్రభుజీ వారి జన్మదినం.

సమాజమే నాది అని జీవించిన వారి కీర్తి రోజులు గడుస్తున్న కొద్దీ పెరుగుతూ ఉంటుంది. భౌతికంగా వారు కనిపించకపోయినా, స్వార్థ పూరితమైన దుర్మార్గుల నుండి సాయిధామం ఆశ్రమాన్ని, వారు ఎన్ను కున్న శిష్యుడినీ వారి శక్తే కాపాడుతుంది. మా గురుదేవులు అన్న విశ్వాసం ఉన్న భక్తులు, శిష్యుల హృదయాలలో నిలిచి అనేక లీలలు చూపిస్తున్నారు. కొందరూ మా గురువుగారూ, మా గురువుగారూ అని గొప్పగా చెప్పకుంటారు. వారి పేరు చెప్పకుని గౌరవాన్ని పొందుతారు. కానీ, వారి ఆశయాలకు, ఆచారాలకు వారు స్థాపించిన మాతృసంస్థకు మాత్రం ద్రోహం చేస్తున్నారు. ఇది గురుద్రోహం అవుతుంది. ఇది మహాపాపం.

మార్చి 19వ తేదీ రాత్రి జ్ఞానధామానికి పుష్పాలంకరణ ఆశ్రమవాసులు చేసారు. ఆశ్రమం అంతా శుభ్రం చేయడం, వంటకు కావలసిన ఏర్పాట్లు చేయడంలో పిల్లలు, పెద్దలు మునిగిపోయారు. 20వ తేదీ ఆదివారం ప్రభాతవేళ పూజ్య గురుదేవులకు నమక, చమక, రుద్రంతో క్షీర జలాభి షేకాలు కన్నులపండుగలా జరిగాయి. అనంతరం పుష్పాలంకరణ, గురుదేవు లకు అష్టోత్తర పూజ జరిగాయి.

83 వసంతాలు నిండిన సందర్భంగా 83 ఆకృతిలో దీపాలంకరణ ఎంతో చక్కగా జరిగింది. దీపం మనలోని చీకటిని తొలగించి వెలుగును నింపేది. భక్తులు, శిష్యులు దీపాలను వెలిగిస్తూ గురుదేవులు మాలో ఉన్న మూర్ఖత్వం అనే చీకటిని తొలగించి మానవత్వాన్ని, ప్రేమతత్వాన్ని నింపండి అని వేడుకున్నారు.

అనంతరం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా కుష్ఠురోగులకు ఇచ్చే వస్త్ర, వస్తుదానాలు ట్రస్టు సభ్యుల చేతి మీదుగా జరిగాయి. తనకంటూ ఏమీ లేకుండా ఆశ్రమ సేవే పరమావధిగా మాతాజీ, గురుదేవుల అడుగు





జాడలో తూచా తప్పకుండా ఆశ్రమాన్ని అభివృద్ధి రంగంలో తీసుకువెళ్ళడం చూడలేని పెద్దమనుషులు అన్యాయంగా, అక్రమ నేరం మోపి దోషిని చేయాలని రెండు నెలలు సాయిధామానికి దూరం చేసారు. రెండు నెలల తర్వాత మార్చి 20వ తేదీ శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానందగారు ఆశ్రమ ప్రవేశం చేసారు. అందరిలో చెప్పలేనంత ఆనందం. ఆశ్రమమంతా నిండుగా, పచ్చగా కనిపించింది. వారి అనుగ్రహ భాషణంతో అందరి మనస్సు ఆనందంతో పులకించిపోయింది. ఎన్ని రోజులైపోయింది ఆ గొంతు విని.

83వ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ గురుదేవుల యొక్క శక్తిని, ఆధ్యాత్మికతను, వారి ఆశయాన్ని భక్తులకు వివరించారు. గొప్పవారి యొక్క జన్మదినాలను మనం ఎందుకు చేసుకోవాలి అంటే వారు నడిచిన మార్గంలో మనం నడవడానికీ, వారు ఆచరించిన పద్ధతులను తెలుసుకోవడానికీ, తద్వారా మనిషి సన్మార్గంలో, సత్పురుషునిగా జీవించవచ్చు. గురువు తాను ఆచరించింది. ఇతరులకు బోధిస్తాడు. కాబట్టి వారి జన్మదినంనాడు వారు చెప్పిన మంచిని పునశ్చరణ చేసుకోవాలి. వారి అడుగుజాడలో నడవాలి అని ముగించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

ఏప్రిల్ 2వ తేదీ ఉగాది కొత్త సంవత్సరం మన తెలుగు వారికి ఈ సంవత్సరం శుభకృత్ నామ సంవత్సరం. అంతా శుభమే. పాత సంవత్సరంలో కలిగిన కష్టాలకు స్వస్తి చెప్పి శుభకృత్ నామ సంవత్సరంలో నూతన ఆలో చనలతో ప్రజలందరికీ మంచి జరగాలనీ, సాయిధామం దినదినాభివృద్ధి చెందాలనీ, నిత్యకళ్యాణం, పచ్చ తోరణంగా వెలుగొందాలనే భగవంతుడిని వేడుకుందాం.

ఉగాది పర్వదినంనాడు వేకువజాముననే బాబావారి అభిషేక పూజ లలో పాల్గొని అనంతరం వేపపువ్వు కోయడం, బెల్లం తరగడం, మామిడి కాయలు కోయడం, చింతపండు రసం తీయడం చకచకా పిల్లలందరూ పూర్తి చేసారు. 9 గంటలకల్లా ఉగాది పచ్చడి కలపడం, బాబా వారికి నివేదన పెట్టడం అయిపోయింది. ఆశ్రమవాసులంతా గురుదేవుల చేతుల మీదుగా ఉగాది పచ్చడి స్వీకరించి, సంవత్సరమంతా పరిస్థితులు ఎలా

ఉండబోతున్నాయో స్వామీజీ వివరించారు. దైవనామ స్మరణ ఎక్కువగా చేయాలని చెప్పారు.

ఏప్రిల్ 4వ తేదీ శ్రీ సాయి విద్యాధామం 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సభ ఏర్పాటు చేసారు. 10వ తరగతి విద్యార్థులంతా పాఠశాలకు, వారికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఉపాధ్యాయుల కృషిని వివరిం చారు. ఏమిచ్చినా వారి ఋణం తీర్చలేమని కన్నీటిపర్యంతమయ్యారు.

అనంతరం నామ రవీందర్‌గారు విద్యార్థులను ఉద్దేశించి చదువు యొక్క ప్రాముఖ్యత వివరించారు. బి.జె.పి. కార్యకర్త అయిన నల్లా వెంకట్ రెడ్డిగారు పాఠశాల వాతావరణం ఎలా ఉంటుంది. కాలేజీ వాతావరణం ఎలా ఉంటుందో వివరించి దానికి తగినట్లు మన జీవితాన్ని మలుచు కోవాలని వివరించారు. అనంతరం సాయి విద్యాధామం ప్రధానోపా ధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు శ్రద్ధ, సహనం అనేవి ఉండాలి. అప్పడే విద్యలో ఉన్నతంగా రాణించగలరని వివరించారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీవారు మాట్లాడుతూ నలుగురు కలిసినప్పడు నాలుగు రకాల ఆలోచనలు సమ్మేళనం జరిగి నప్పడు ఆచోట మంచి జరుగుతుంది. మీ 10వ తరగతి అయిపోతుం దంటే విద్య అక్కడితోనే ఆగిపోవడం లేదు. నాలుగు గోడల మధ్య, క్రమ శిక్షణ మధ్య యిప్పటివరకు మీరు తల్లి తండ్రి తర్వాత ఉపాధ్యాయులు మీకు ఆ స్థానంలో తల్లిదండ్రులుగా, స్నేహితులుగా, తోబుట్టువులుగా అన్నీ వారే అయి మీకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థి హృదయాన్ని చదివి శిక్షణ ఇస్తారు. పుస్తక జ్ఞానమే కాకుండా అన్నీ రంగాలలో మీకు చైతన్యాన్ని కల్పించారు. అనేకరకాలైన మనుషుల మధ్యన మీరు బ్రతక బోతున్నారు. ఎంతోమంది విద్యార్థుల జీవితాల మధ్యకు వెళ్లబోతున్నారు. మీరు వారికి ఆదర్శంగా ఉండాలి అంటే ఇక్కడ పాఠశాలలో మీరు నేర్చుకున్న సంస్కా రాన్ని విడవకూడదు. దేనికీ బానిసలు కాకూడదు. బయట ప్రపంచం చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కన్ను పరిగెత్తిన చోటికల్లా మీ మనసు పరిగెత్తకూడదు.





ఒక పాఠశాల నుంచే డాక్టర్, లాయర్, ఇంజనీర్, దేశాన్ని మలిచే ఓ రాజకీయ నాయకుడు తయారుకాగలరు. మీరెదిగే స్థాయిని, గతిని, స్థితిని మార్చుకునే భావాన్నిచ్చేటువంటిదే పాఠశాల. ఇందులో కనుక మీ ఆలోచనలు సరిగా పెంచుకోకపోతే అందవిహీనంగా అగుపిస్తారు.

మీ జీవితంలో మీరు ఆదర్శంగా ఎన్నుకునే వ్యక్తులు ఉన్నతులై ఉండాలి. మంచిమాటలతో మిమ్మల్ని తప్పడు మార్గంలో పయనింప చేస్తారు. మాయమాటలతో మభ్యపెడతారు. వీటికి లొంగకండి. మీ ఆలోచనా విధానం పెరగాలంటే మంచి వ్యక్తులు-స్వామి వివేకానంద, శ్రీ అబ్దుల్ కలాం లాంటి వారి జీవిత చరిత్రలు చదవండి. ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించండి. మీకు, మీ తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు మంచిపేరు తీసుకురండి. ధర్మమార్గంలో జీవించండి అని సెలవిచ్చారు.

ఏప్రిల్ 10న శ్రీరామనవమి. మానవజీవితాలను సంస్కరించగల మహాకావ్యం రామాయణం. రాముడంటే ధర్మం. ధర్మం అంటే రాముడు. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి గొప్పవాడిగా ఎలా ఎదగవచ్చో రామా యణం ద్వారా తెలుసుకోవచ్చు.

సాయిధామం ద్వారవతి సాయి దేవాలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామ చంద్రుల వారి పూజ, పట్టాభిషేకం జరుగుతాయి. ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానాలు చేయించి, నూతన వస్త్రాలు, అలంకరణలు పూర్తి చేసి శాస్త్రోక్తంగా పూజ పూర్తి చేసి, పానకం, వడపప్ప ప్రసాదం స్వీకరించారు భక్తులు.

**శ్రీ కోదండరామ సాయి సన్నిధానం ఆశ్రమం - సాయిధామం శాఖ - సత్తెనపల్లి**

మార్చి 2వ తేదీ శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది తెలుగు సంవత్స రాది రోజున ఆశ్రమంలో రామాలయం, బాబా మందిరం, ఆంజనేయ స్వామి ఆలయం, పరమపూజ్య గురుదేవుల మందిరం మామిడి తోరణా లతో అలంకరించాము. స్వామివార్లందరికీ అభిషేకాలు, నూతన వస్త్ర ధారణ, పూజా కార్యక్రమాలు జరిగాయి. నూతన వస్త్రాలతో స్వామివార్లు దివ్యశోభతో దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులందరికీ ఉగాది పచ్చడి, ప్రసాద

వితరణ జరిగినది.

ఏప్రిల్ 10వ తేదీ ఆదివారం శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో పురాతనమైన దేవాలయంలో ప్రతిష్ఠితమై భక్తులందరికీ అభయప్రదాత అయి, కోరిన కోర్కెలు తీర్చే స్వామి సీతా, లక్ష్మణ, హనుమత్సమేత కోదండ రాముల వారి సన్నిధిలో సీతారామ కళ్యాణం వైభవోపేతంగా జరిగినది. ముందురోజు శనివారం సాయంత్రానికి రామాలయం, ఆంజనేయ స్వామి వారి ఆలయాలను విద్యుద్దీపాలంకరణ చేసారు. రాత్రికే మరుసటి రోజుకు కావలసిన అన్ని ఏర్పాట్లు టెంట్లు వేయడం, తోరణాలు కట్టడం, వేదికను అలంకరించడం మొదలైన పనులన్నీ భక్తిశ్రద్ధలతో పూర్తి చేసారు. రామాలయంలో మూలవిరాట్టులైన స్వామివార్లను నూతన వస్త్రాలతో, పూలమాలలతో, వెండి కిరీటాలతో అలంకరించాము. అలంకరింపబడిన స్వామివారు కళ్యాణశోభతో దర్శనమిచ్చారు. 9వ తేదీ సాయంత్రం గం.5.30 ని.లకు ఉత్సవమూర్తులైన సీతారాముల వారికి మంగళస్నానాలు చేయించి ముత్తయిదువులతో స్వామి వారిని పెళ్లికుమారుడిగా, సీతమ్మ తల్లిని పెళ్లి కుమార్తెగా చేసి హారతిచ్చి పండు, తాంబూలం పంచాము. ఈ వేడుకకు వచ్చిన భక్తులంతా భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆనంద పరవశులయ్యారు. 10వ తేదీ ఆదివారం ఉదయం గం.6.00లకు స్వామి వార్లకు సుప్రభాత సేవ, అనంతరం అష్టోత్తర శత నామ పూజ జరిగినది.

ఉదయం గం.9.30ల నుండి సీతారాముల కళ్యాణఘట్టం ప్రారంభమైనది. మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా నూతన వస్త్రధారులై, కళ్యాణ తిలకం దిద్దుకొని, బుగ్గన చుక్క, నుదుటిన భాసికం కట్టుకొని కళ్యాణ శోభతో వెలిగిపోతున్న సీతారాములను పీటల మీద కూర్చొని కళ్యాణం జరిపించే భక్తులు తొమ్మిది జంటలు రామచంద్రుల వారిని, సీతాదేవిని లక్ష్మణ, హనుమంతులు వెంటరాగా ఊరేగింపుగా ఆలయం చుట్టూ అత్యంత ఆనందాత్సోహాలతో వేదమంత్ర పఠనం జరుగుతుండగా దంపతులు స్వామివార్లను ఒకరి తర్వాత ఒకరు మోస్తూ ప్రదక్షిణ చేసారు. ఆ దృశ్యం ఎంతో కన్నులపండువగా సాగినది. అనంతరం ఎదురుకోళ్ళ కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా రాములవారి వైపు కొందరు, సీతమ్మ





వారి వైపు కొందరు ఉండి కట్నకానుకల విషయమై సరదా ఛలోక్తులతో సాగిన ఈ కార్యక్రమం అందరినీ ఆనందపరవశులను చేసినది. చివరగా పూజారిగారు మనమంతా సీతమ్మవారివైపే సీతా మమసుతా అని జనకుడు అన్నట్లు మనమంతా సీతా మమసుతా అని రాములవారికి సీతమ్మను కన్యాదానం చేసి కన్యాదానఫలం పొందటానికి వచ్చినవారమే అని చెప్పడం అందరికీ ఆనందం కలిగించినది. అనంతరం సీతాదేవి, శ్రీరాముల వారిని వేదికపై ఆశీనులను చేసాము. ప్రక్కన లక్ష్మణ, హనుమంతుల వారు పరివేష్టితులవగా పూజారి ప్రేమ్‌కుమార్‌గారు కళ్యాణ కార్యక్రమం ప్రారంభించారు.

ముందు సంకల్పం చెప్పించి, ఆ తరువాత విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, ఆదిత్యాది నవగ్రహాదిక్పాలక పూజలు, మహాసంకల్పం, కన్యాదానం, మధుపర్క పూజ, స్వామి వారి ప్రవర, కంకణధారణ, జీలకర్ర, బెల్లం పెట్టించడం, నూతన వస్త్రాలు, మాంగళ్యపూజ, తలంబ్రాలు, అష్టోత్తర పూజ మొదలైన పూజ కార్యక్రమాలన్నీ 9 మంది దంపతులచేత శాస్త్రోక్తంగా చేయించారు. అభిజిత్ లగ్న పుష్కరాంశమందు మాంగళ్యధారణ చేయించారు.

కళ్యాణం ఆసాంతం భక్త కోటి చేసిన జయజయ ధ్వానములతో, గోవింద నామస్మరణతో ఆశ్రమం మారు మ్రోగినది. దంపతులందరూ తలంబ్రాలు పోయడం మరచిపోలేని అనుభూతిగా భావించారు. చివరగా ప్రసాద నివేదన, హారతి మంత్ర పుష్పంతో కార్యక్రమం నిర్విఘ్నంగా ముగిసినది. అందరికీ పానకం, వడపప్పు, పొంగలి ప్రసాదాల వితరణ జరిగినది. పరమపూజ్య గురుదేవుల ఆశీస్సులు, శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారి దివ్యఆశీస్సులతో ఈ కార్యక్రమం శోభాయ మానంగా జరిగినది. ఈ కార్యక్రమాలకు శక్తివంచన లేకుండా కష్టపడుతున్న కార్యకర్తలకు, అన్నదాన కార్యక్రమానికి, కళ్యాణ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న భక్తులందరికీ శ్రీ సీతాసమేత కోదండరాముని దివ్య ఆశీస్సులు కలగాలని సాయివాణి కోరుకుంటున్నది.